ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం । 3 డిసెంబర్ 2025 । ■ 12 పేజీలు




## సంస్థాగతంగా పార్టీని బలోపితం చేస్తా




# బుజ్జగింపులు..షురూ..!

## గ్రామాల్లో అభ్యర్థుల విత్‌డ్రా కోసం కొనసాగుతున్న సంప్రదింపులు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ రెబెల్స్‌తో పాటు స్వతంత్రులు విత్ డ్రా చేసుకునే విధంగా ప్రయత్నాలు ■ భారీ ఖర్చుకు సైతం మొగ్గు చూపుతున్న అభ్యర్థులు
■ మొదటి విడత పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు ■ చివరి రోజు జోరు తగ్గని నామినేషన్లు
■ అర్ధరాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ ■ ముగిసిన రెండో విడత ■ నేడు మూడవ విడతకు నోటిఫికేషన్
■ నేడు మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ■ పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఓవైపు రెండోవ విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా, మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థులకు బుజ్జగింపుల పర్వం మొదలైంది. ప్రధాన పార్టీల మద్దతుతో వేసిన వారే కాకుండా రెబల్స్, స్వతంత్రుల పైన దృష్టి పెట్టి విత్‌డ్రా చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. మొదటి విడత పోటీలో ఉన్న అభ్యర్థుల విత్ డ్రాకు ప్రధాన పార్టీల నేతలు వారితో మాట్లాడుతున్నారు. పోటీ నుంచి వైదొలుగితే తగిన అవకాశాలు కల్పిస్తామని భవిష్యత్తుల్లో కీలక పదవుల ను ఇస్తామని హామీలు ఇస్తున్నారు. కొన్ని చోట్ల గుడ్ విల్ కింద కొంత అమౌంట్ ఇచ్చి సెటిల్ చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ ఎన్నికల రెండోవిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రెండో విడతలోనూ చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. రెండో రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు రాగా, మంగళవారం తక్కువగానే ఉంటాయని భావించారు. కానీ రెండో రోజుకన్నా చివరి రోజే ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి క్యూలో ఉన్న వాళ్ళకు టోకెన్లు ఇచ్చి, బయటకు పంపించారు. టోకెన్ల ప్రకారం పది మంది చొప్పున లోపలికి అనుమతించారు.




## కౌటాలలో తుపాకుల కలకలం

■ రూ.50 లక్షలు ఇవ్వాలని లెటర్ రాసి ఓ వ్యాపారిని హత్య చేసేందుకు వెళుతుండగా అరెస్టు చేసిన పోలీసులు ■ తుపాకీ, తపాంచ, 2మ్యాగ్జిన్లు స్వాధీనం
■ వివరాలు వెల్లడించిన కుమ్రంభీం భీం జిల్లా ఎస్పీ నితికా పంత్

కుమ్రంభీం జిల్లా కౌటాలలో ఓ వ్యాపారిని తపాకితో కాల్చి చంపేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపింది. కౌటాల పోలీసు స్టేషన్‌లో ఎస్పీ నితికా పంత్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కౌటాల మండలం సాండ్‌గాంకు చెందిన కుర్బంకర్ అజయ్ అనే యువకుడు సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో హిందీ సినిమాతో ప్రేరణ పొందాడు. బాగా డబ్బు ఉన్న వారిని బెదిరించి అవసరమైతే చంపి డబ్బులు వసూలు చేయాలని, జూన్ 11న కౌటాలకు చెందిన ఓ వ్యాపారికి రూ. 50 లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతానని లేఖలు రాశాడు.

జిల్లాకు జాతీయ స్థాయిలో

## మరోసారి గుర్తింపు

■ నీతి ఆయోగ్ ర్యాకింగ్‌లో నార్నూర్‌కు నాలుగో స్థానం
■ రూ.1.5కోట్ల పురస్కారం..

ఆదిలాబాద్ జిల్లాకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.. నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో జిల్లాలోని నార్నూర్ మండలం దేశంలోని 500 బ్లాక్‌ల్లో 4వ స్థానంలో నిలిచింది. అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా రూ.1.5కోటి నగదు పురస్కారం లభించింది.






సింగరేణి బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి

## కీలక ఖనిజాల వెలికితీతకు ఒప్పందం

■ సీఎస్ఐఆర్-ఐఎంఎంటీతో సింగరేణి బొగ్గువ్యర్థాల నుంచి ఖనిజాల వెలికితీతకు ఒప్పందం
■ ఖనిజ స్వయం సమృద్ధిలో గొప్ప ముందుడుగు ■ సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్
■ స్వదేశీ సాంకేతికతో ఖనిజాల వెలికితీత ■ ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామనుజ నారాయణ్

సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి వాటిని వెలికి తీసేందుకు ప్రముఖ పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్- ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ)తో సంయుక్త భాగస్వామ్యంలో పని చేసేందుకు సింగరేణి కాలరీస్ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ప్లై యాష్, బాటమ్ యాష్‌లలోని ఖనిజాలను వెలికితీయనున్నారు.

# నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**చెన్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)** రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో 3వ విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామపంచాయతీలో ఈ నెల 3వ తేదీ నుండి జరగనున్న 3వ విడత నామినేషన్ ప్రక్రియ కొరకు చేసిన ఏర్పాట్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, సి.ఐ. లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో మద్దతు ధర ప్రకారం నగదు జమ చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో చేపట్టిన పట్టణ ఆరోగ్య కేంద్రం, అమృత్ 2.0, సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదనంతరం 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదుల మరమ్మత్తు, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించడంతో పాటు సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్

**సిర్పూర్ (టి), డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)** సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో అప్రమత్తంగా ఉండి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు. సిర్పూర్(టి) మండలం సరిహద్దులోని వెంకట్రావుపేట– పోడ్సా వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్టును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల రాక పోకల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గడ్చిరోలి నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మద్యం, డబ్బులు, ఇతర ప్రలోబాలకు గురి చేసే వస్తువులు రవాణా చేస్తే ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదన్నారు. అట్టి వాహనాలను సీజ్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆమె వెంట డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ సురేష్, చెక్ పోస్టు సిబ్బంది ఇమ్రాన్‌ఖాన్ తదితరులు ఉన్నారు

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి...**

ఓటీపీ, యూపీఐ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ సారథి పేరుతో ప్రత్యేక అవగాహన డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణకు ‘ ఫ్రాడ్ కా ఫుల్ స్టాఫ్‘ ప్రచార కార్యక్రమం మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారని చెప్పారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, సీఐలు రవీందర్, బాలాజీ వరప్రసాద్, తేజస్విని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మాల్యాల్‌లో జాతీయ మానసిక ఆరోగ్య సర్వే విజయవంతం



**జన్నారం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)** గ్రామ ప్రజల యొక్క మానసిక ఆరోగ్య స్థితి, జీవనశైలి సమస్యలు, ఆరోగ్య అవగాహన స్థాయిని అంచనా వేయడం కోసం, చికిత్స అంతరాలను గుర్తించడానికి, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బీబీనగర్ మరియు నిమ్హాన్స్ బెంగళూరు ఆధ్వర్యంలో, (నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే 2) ప్రాజెక్టులో భాగంగా, మండలం, రోటిగుడ పల్లె దవాఖాన కింద మాల్యాల్ గ్రామంలో, మంగళవారం ఆరోగ్య సర్వే నిర్వహించడం జరిగిందని మండల ప్రభుత్వ వైద్యురాలు ఉమాశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్స్ డాక్టర్ వామన్ కుల్కర్ని, డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ఫ్యామిలీ మెడిసిన్, డాక్టర్ సాయిక్రిష్ణ తిక్కా, మానసిక వైద్య విభాగం మార్గదర్శకత్వం వహించగా, నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే 2 తెలంగాణ స్టేట్ కో ఆర్డినటర్ ఆర్. వినీల్, మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో సర్వే కొనసాగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య సర్వేలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్, వృద్ధాప్య సమస్యలు, మద్యపానం, మహిళల ఆరోగ్యం, పిల్లల పోషణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ మానసిక ఆరోగ్యానికి అవగాహన కోసం బ్రోచర్లు మరియు అవసరమైన చోట ప్రాథమిక వైద్య సలహాలను అందించామన్నారు. ఇట్టి కార్యక్రమం స్థానిక గ్రామ ఎమ్ఎల్‌హెచ్‌పి నవనీల ఏ.ఎన్.ఎం పద్మ, ఆశా వర్కర్స్ తిరుమల, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సహకారంతో సోమవారం సర్వే విజయవంతంగా జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా మాల్యాల్ గ్రామ ప్రజలు సానుకూలంగా స్పందించారని, ఈ ఆరోగ్య సర్వే ద్వారా అధికారులు సేకరించిన సమాచారం జాతీయ మానసిక ఆరోగ్య విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మానసిక సమస్యలకు 14416 టెలిమనస్ నెంబర్ గురించి వివరించారు. సర్వేలో ప్రతీ ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యం వివరాలను సేకరించిన వారిలో తెలంగాణ ఆరోగ్య బృందం వినిత,గ్రేస్,వేణు మాధురి, రంజిత్ యాదవ్, తిరుపతి, మణికంట, శ్రీధర్, వెంకట రావు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలి

## కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)** ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రకాష్‌రావులతో కలిసి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రతి లబ్ధిదారులు ప్రారంభించేలా మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 498 ఇళు మంజూరు చేశామని అన్నారు. ఇప్పటి వరకు 391 ఇళ్ల పనులు ప్రారంభించారని అన్నారు. మిగిలిన 107 మంది లబ్ధిదారులు పనులు చేపట్ట లేదని తెలిపారు. ఇందుకు గల కారణాలను తెలుసుకొని పనులు ప్రారంభించేందుకు మెప్మా కింద మహిళల సంఘాల నుంచి రుణసదుపాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 458 ఇల్లు మంజూరు కాగా ఇంకా 105 పారరంభించలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ నెల 20వ తేదీలోగా పూర్తి అయిన ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందని, దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖడీఈ వేణుగోపాల్, మున్సిపల్ కమీషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బలపరచిన

# అభ్యర్థులను గెలుపించుకోవాలి

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)** బజార్హత్నూర్ మండలంలోని అన్ని సర్పంచ్ స్థానాలను బీజేపీ బలపరచిన అభ్యర్థులు కైవసం చేసుకుంటరని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పంచాయతీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు సిడాం వికాస్ బీజేపీలో చేరారు. అనంతరం పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... వార్డు మెంబర్స్‌తో సహా అన్ని సర్పంచ్ స్థానాలను గెలుపే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని, ప్రతీ నాయకులు, కార్యకర్తలు అందుకు తగినట్లుగా కృషి చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, బీజేపీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారన్నారు.



# విత్తన బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా


**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ముసాయిదా విత్తన బిల్లు-2025 రూపకల్పనలో ప్రతి వర్గ అభిప్రాయం కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, విత్తన డీలర్లు, కంపెనీలు, రైతు ఉత్పాదక సంఘాలు, శాస్త్ర వేత్తలు, అధికారులు పాల్గొన్న ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త విత్తన బిల్లు రైతు ప్రయోజనాలను కాపాడేలా, నాణ్య మైన విత్తనాల సరఫరాపై కట్టుదిట్టమైన నియంత్రణలు ఉం డేలా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి రైతు నుంచి శాస్త్రవేత్త వరకు అందరి సూచనలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు. అందరి సూచనలను లిఖితపూర్వకంగా సేకరించి రాష్ట్రానికి పంపాలని, నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడు తూ, నాణ్యమైన విత్తనాల కొరత, అధిక ధరలు, నకిలీ విత్తనాల విక్రయం, విత్తనం వల్ల పంట నష్టపోయినప్పుడు కంపెనీల బాధ్యత వంటి అంశాలను ప్రస్తావించారు. పంటలు విఫలం అయినప్పుడు రైతుకు రక్షణ కల్పించే విధానాలు బిల్లులో ఉండాలని కోరారు. రైతు ఉత్పాదక



సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, స్థానిక విత్తన ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని, నిల్వ, రవాణా సదుపా యాలను విస్తరించాలని కోరారు. చిన్న రైతులకు అందుబా టులో ఉండే విధంగా విత్తన విధానం ఉండాలని సూచించా రు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ,విత్తన తని ఖీ దళాల బలోపేతం, ల్యాబ్‌లలో ఆధునిక పరికరాలు, రైతు లకు అవగాహన కార్యక్రమాల అవసరాన్ని వివరించా రు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, విత్తన



కంపెనీల ప్రతినిధులు, రైతుసంఘాల నాయకులు, వ్యవ సాయ విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, పాల్గొన్నారు.



# 14న అయ్యప్ప స్వామి ఆలయంలో ఆరట్టు మహోత్సవం

**లోకేశ్వరం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని అన్నపూర్ణ క్షేత్రంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ ఆరట్టు మహొత్సవం నిర్వహించడం జరుగుతుంది. ఈ ఆరట్టు మహొత్సవం బైంసాలోని పురవీధుల గుండా ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా గడ్డన్న వాగు వరకు వెళ్ళి అక్కడ అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని అభిషేకాలతో పూజలు నిర్వహించి. తదనం తరం ఆలయానికి తీసుకు రావడం జరుగుతుంది. మధ్యానం భీక్ష ఉంటుంది కావున ప్రతీ ఒక్క అయ్యప్ప స్వామి వచ్చి అయ్యప్ప స్వామి యొక్క కరుణా-కటా క్షాలు పొందగలరని మనవి. అదేవిధంగా రాత్రి 6:30 గంటలకి అన్నపూర్ణ క్షేత్రం లో మన ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి. సాయినాథ్ గురుస్వామి యొక్క పెద్ద కుమారుడు అయినటువంటి మణి ఆశీర్వాద్ యొక్క ఋషితుల్య మహపడి పూజ కలదు. కావున మన ముధోల్ తాలూకాలో గల ప్రతీ సన్నిధాన స్వాములు రాగలరనికోరుచున్నాం. ఆలయ ప్రధాన అర్చకులు. మంత్రి. సాయినాథ్, సమస్త అన్నపూర్ణ క్షేత్ర సన్నిధానం స్వాములు కోరారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు ఈ సందర్భంగా కోరారు.

# సీఎం సభాస్థలిని పరిశీలించిన ఇంచార్జీ మంత్రి జూపల్లి

## సీఎం సభ ఏర్పాట్లపై పలు సూచనలు

**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు చేరుకున్న ఆదిలాబాద్‌లో ఈనెల 4వ తేదీన పర్య టించనున్న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. మంగళవారం ముందుగా కలెక్టరేట్ వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం నేరుగా సీఎం సభ నిర్వహించే ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు చేరుకున్నారు. అక్కడ సీఎం భహిరంగ సభ జరిగే ఏర్పాట్లను జిల్లా నేతలతో కలిసి మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల్ చారి, డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం



బాపూరావు, నేతలు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, శ్రీకాంత్ రెడ్డి, సాజిద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

# అరిగెల నాగేశ్వరావు సమక్షంలో బీజేపీలో చేరికలు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ మండలంలోని రాజుర గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువకులు భాజపా పార్టీలో చేరారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు,ఈ సందర్భంగా అరిగెల మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే



జరిగాయని తెలిపారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మోతుగూడ గ్రామ పంచాయతీ లో భాజపా బలపరిచిన అభ్యర్థి గెలవడం ఖయం అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, భాజపా జిల్లా యూత్ అధ్యక్షులు గాజుల రాజేంద్రప్రసాద్, యువ నాయకుడు అరిగెల అనురాగ్,నాయకులు దీపక్ రావ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపేలా క్రీడా పోటీలు

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**మంచిర్యాల, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపేలా జిల్లా స్థాయి క్రీ డా పోటీలు నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య తెలిపారు. మంగళవారం అంతర్జా తీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీలకు జిల్లా సంక్షే మ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ లతో కలిసి హాజరై జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదన పు కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో ఆత్మస్థై ర్యాన్ని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ క్రీడాకారులు పోటీలలో నైపుణ్యం ప్రదర్శిం చాలని, జిల్లాలోని దివ్యాంగులకు జూనియర్స్ (18 సం.ల లోపు బాల బాలికలకు వేరువేరుగా), సీనియర్స్ (18 సం.ల నుండి 54 సం.ల వరకు మహిళలు, పురుషులకు వేరువేరుగా) వివిధ విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లా స్యిలో గెలుపొందిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అంధులకు రన్నింగ్, షార్ట్ పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షార్ట్ పుట్, జావెలిన్ త్రో, శారీరక దివ్యాంగులకు షార్ట్ పుట్, జావెలిన్‌త్రో, క్యారమ్స్, బుద్ధి మాంద్యం దివ్యాంగులకు రన్నింగ్, షార్ట్ పుట్ విభాగాలలో పోటీలు నిర్వహించ డం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధి త అధికారులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతిని ధులు, దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు.



# నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

## కుమ్రంభీం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలె క్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళ వారం జిల్లాలోని దహేగాం మండలం కొత్మర్, దహేగాం గ్రామ పంచాయతీలు, పెంచికల్‌పేట మండలంలో నామినే షన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించి నామినేషన్ ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబి తా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధ నలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటి న తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. విధులు కేటా



యించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుం డా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. దహేగాం మండలంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఎన్నికల సామాగ్రి నిల్వ, పంపిణీ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దహెగాం మండలం బిబ్రా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంచికల్ పేట మండలం దరోగాపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధ న తీరు, వంటశాల, మధ్యాహ్న భోజనం పథకం అమలు, ఆహారం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీ లించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని, విద్యార్థు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాల కు ఎదగాలని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, మండల పంచాయతీ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌటాలలో తుపాకుల కలకలం

**రూ.50 లక్షలు ఇవ్వాలని లెటర్ రాసి వ్యాపారిపై హత్యాయత్నం - వివరాలు వెల్లడించిన ఎస్పీ నితికా పంత్**





**కౌటాల, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

కుమరం భీం జిల్లా కౌటాలలో ఓ వ్యాపారిని తపాకితో కాల్చి చంపేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపింది. కౌటాల పోలీసుస్టేషన్‌లో ఎస్పీ నితికా పంత్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కౌటాల మండలం కౌటి(సాండ్‌గాం)కు చెందిన కుర్బంకర్ అజయ్(31) అనే యువకుడు సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో హిందీ సినిమాతో ప్రేరణ పొందాడు. బాగా డబ్బు ఉన్న వారిని బెదిరించి అవసరమైతే చంపి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడది జూన్ 11వ తేదీన రాత్రి బెదిరిస్తూ కౌటాలకు చెందిన ఓ వ్యాపారికి లేఖలు రాశాడు. రూ. 50 లక్షలు ఇవ్వాలని, లేకుంటే నీ కుటుంబ సభ్యులను చంపుతానని రెండు లేఖలు రాసి సదరు వ్యాపారి ఎరువుల దుకాణం వద్ద పెట్టాడు. కానీ ఆ వ్యాపారి స్పందిచక పోవడంతో యూట్యూబ్‌లో చూసి పిస్టల్, తపంచా లాంటి మారణాయుధాలు బిహార్‌లో దొరుకుతాయని తెలుసుకున్నాడు. జూలై చివరి వారంలో బిహార్ వెళ్లి ఆగస్టు మొదటి వారం వరకు అక్కడే ఉన్నాడు. బాబు సాహెబ్ అనే వ్యక్తి దగ్గర రూ. 55 వేలు చెల్లించి ఒక తుపాకి, రెండు మ్యాగజిన్లు, దీనికి సంబంధిచిన 20 బుల్లెట్లు, ఒక తపంచ, దీనికి సంబంధించిన ఒక బుల్లెట్ కొనుగోలు చేసి అక్కడే షూటింగ్ నేర్చుకున్నాడు. మూడు బుల్లెట్లు అక్కడే ప్రాక్టీస్‌లో ఉపయోగించాడు. ఇంటికి చేరుకున్న అనంతరం ప్రాణహిత నది ఒడ్డున ఒక బుల్లెట్ గాలిలోకి ఫైర్ చేసి ప్రాక్టీస్ చేశాడు. సెప్టెంబరు 26న కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రైలు ఎక్కి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ తీసుకుని డబ్బులు ఇవ్వాలని మళ్లీ ఎరువుల వ్యాపారికి కుర్బంకర్ అజయ్ ఫోన్ చేశాడు. అప్పటికీ ఆ వ్యాపారి స్పందించక పోవడంతో అక్టోబరు 15వ తేదీన రాత్రి సమయంలో వ్యాపారి తమ్ముడిని చంపాలనే ఉద్దేశంతో తుపాకిలో రెండు బుల్లెట్లు నింపుకున్నాడు. వ్యాపారి తమ్ముడు ఇంటికి వెళ్లే మార్గమధ్యలో వేచి ఉన్నాడు. వ్యాపారి తమ్ముడు రాగానే అతడి ముఖంపై లైట్ ఫోకస్ పెట్టి ఒక బుల్లెట్ ఫైర్ చేశాడు. గురి తప్పడంతో అక్కడి నుంచి కుర్బంకర్ అజయ్ పారిపోయాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సదరు వ్యాపారిని ఎరువుల దుకాణంలోనే హతమార్చాలనే ఉద్దేశంతో తుపాకితో పాటు మూడు బుల్లెట్లు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్నికల సందర్భంగా తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి ఒక తుపాకి, ఒక తపంచా, రెండు మ్యాగజిన్‌లతో పాటు 15 చిన్న బుల్లెట్లు, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆధ్వర్యంలో చేపట్టారు. దర్యాప్తునకు కృషి చేసి కౌటాల సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై చంద్రశేఖర్, కాగజ్‌నగర రూరల్ ఎస్సై సందీప్, పోలీసు సిబ్బంది రమేశ్, సాయిరాజ్, దుర్గప్రసాద్, దీపక్‌ను ఎస్పీ నితికా పంత్ అభినందించారు.



## స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ

**ఉట్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ మండలంలో ఆర్తి టైప్ రైటింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లాలో అధిక చలిని దృష్టిలో పెట్టుకుని ఈ సహాయం అందించినట్లు రాంజీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ జేపి నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్తి టైప్‌ఇన్స్టిట్యూట్‌ప్రిన్సిపాల్ చరణ్, మనోజ్ పాల్గొన్నారు.

## 2.6 కేజీల గంజాయి పట్టివేత

**వాంకిడి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

అక్రమంగా గంజాయి సాగు చేసి విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసిన సంఘటన వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని జైత్పూర్ గ్రామానికి చెందిన బోర్కుటే సుభాష్.గుర్నులే సురేష్. ఆత్రం భీము లు అక్రమంగా గంజాయి సాగు చేస్తూ.. విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 16 గంజాయి మొక్కలతో పాటు 2.6 కేజీల ఎండు గంజాయి లభ్యం అయింది. దీని విలువ సుమారు 2.25లక్షలు ఉంటుందని తెలిపారు.

## రేపు భైంసాలో పోలీసుల ప్రజావాణి



**ముథోల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

బైంసా పట్టణంలో బుధవారం పోలీసుల ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఏఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా పోసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అవకాశాన్ని సద్వినించుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల కోరారు.

## యాత్రానందం సర్వీసును సద్వినియోగం చేసుకోండి

**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

భక్తుల సౌకర్యం కోసం టీజీ ఆర్టీసీ యాత్రానందం సర్వీస్‌లను నడుపుతున్నట్టు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి అరుణాచలంకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. మరుసటి రోజు ఉదయం కాణిపాకం వర సిద్దివినాయకుణ్ణి దర్శించుకొని అరుణాచలం వెళ్తుంది. అరుణాచలంలో దర్శనం గిరి ప్రదక్షిణ చేసుకొని 4వ తేదీ రోజు తిరుపతి చేరుకుంటుంది. 5వ తేదీ రోజు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం బయలుదేరి 6వ తేదీ జోగిలాంబాను దర్శనం చేరుకొని నిర్మల్ కు చేరుకుంటుంది. డిసెంబర్ 3వ తేదీ రోజు అరుణాచలంలో కార్తీక జ్యోతి వెలుగుతుంది. కావున నిర్మల్ మండలం అక్కాపూర్ ఒకే గ్రామం నుండి 35 మంది ప్రయాణికులు ఈ బస్సును బుక్ చేసుకోవడం గమనార్హం.




ఇలాగే ఏ గ్రామానికైనా 30 మందికి పైగా ప్రయాణికులు ఉంటే మీరు కోరుకున్న బస్సు సౌకర్యం కలిపిస్తామని డిపో మేనేజర్ పండరి తెలిపారు. బస్సులో బయలుదేరుతున్న ప్రయాణికులకు డిపో మేనేజర్ శుభాకాంక్షలు తెలిపారు.



### శబరిమల భక్తుల కోసం

## కాగజ్‌నగర్-కొల్లాం ప్రత్యేక రైలు

**కాగజ్‌నగర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

డిసెంబర్ 13, 2025న కాగజ్‌నగర్ నుంచి కొల్లాం జంక్షన్ వరకు అయ్యప్ప మాలధారుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు నడపనున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కోరిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రైలు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్ మీదుగా ప్రయాణిస్తుంది. ఇందులో ఫస్ట్ ఏసీ నుంచి జనరల్ వరకు అన్ని రకాల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. మకరజ్యోతి దర్శనం కోసం మరో ప్రత్యేక రైలు నడపాలని కూడా విజ్ఞప్తి చేశారు.

## కిక్ బాక్సింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి హైస్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న నమ్రత ఇటీవల మంచిర్యాల జిల్లాలో జరిగిన అస్మిత ఖేల్ ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వరరావు తెలిపారు. కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, కరస్పాండెంట్ ప్రసాద్, పాఠశాల మేనేజ్మెంట్ సభ్యులు రాజ్ కుమార్, దాసరి సురేష్, రాజ్ కుమార్, అజయ్ క్రాంతి కుమార్, పిఈటి గోగర్ల సాయి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు

**ఉట్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 11న జరగనున్న తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుందని ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. మంగళవారం నార్నూరులో పర్యటించారు. ఎన్నికల అధికారులను ఓటర్లు సహకరించాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఉండాలని హెచ్చరించారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు సహకరించాలి

**బెల్లంపల్లి ఏసిపి రవికుమార్**

**తాండూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ తనిఖీ చేశారు. మంగళవారం ఆయన తాండూరు మండలం కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలనీ కోరారు. సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలయిన తాండూర్, అచలాపూర్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని, ఎవరైనా అట్టి నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబమని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే వీడియోలను తీసి పెట్టరాదని, అలాంటివి మా దృష్టికి వస్తే



గ్రూప్ అడ్మిన్ లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనలు సూచ తప్పకుండా పాటించాలని పునరుద్ఘాటించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ఎన్నికల కోడ్ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ఈ కోడ్ ను ఉల్లంఘించకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తమ సిబ్బందికి సహకరించాలన్నారు. స్వేచ్ఛాయుత పద్ధతిలో ప్రతి ఒక్కరు ఓటు వేయాలని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. 100% పోలింగ్ కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆయన వెంట తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ ఉన్నారు.

## సింగరేణి బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి
# కీలక ఖనిజాల వెలికితీతకు ఒప్పందం



- సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్
- సీఎస్ఐఆర్-ఐఎంఎంటీతో సింగరేణి బొగ్గుమైనింగ్ వ్యర్థాల నుంచి ఖనిజాల వెలికితీతకు ఒప్పందం
- ఖనిజ స్వయం సమృద్ధిలో గొప్ప ముందుడుగు
- స్వదేశీ సాంకేతికతో వ్యర్థాల నుంచి విలువైన ఖనిజాల వెలికితీత
- ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామనుజ నారాయణ్

**మంచిర్యాల, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి వాటిని వెలికి తీసేందుకు ప్రముఖ పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్- ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ) తో సంయుక్త భాగస్వామ్యంలో పని చేసేందుకు సింగరేణి కాలరీస్ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లలో నిక్షిప్తమై ఉన్న కీలక ఖనిజాలను వెలికితీయనున్నారు. మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించేందుకు అనుగుణంగా ఇరుపక్షాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కీలక ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఈ ఏడాది జూన్ లో తొలుత ఒక అవగాహన కుదుర్చుకున్నామని, తాజా ఒప్పందంతో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బలమైన ముందడుగు పడిందని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతంలోని ఓపెన్ కాస్టు గనుల్లో, ఎస్టీపీపీ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్, బాటమ్ యాష్‌లో ఇక్కడి గుట్టల్లో కీలక ఖనిజాల ఉనికిని ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో కొన్నింటిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించబడిందని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా విడుదల అయ్యే ఫ్లై యాష్ లో కూడా వీటిని కనుగొనడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే మణుగూరుకు సమీపం లోని దుర్గం గుట్ట బ్లాకులో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు శాంపిల్స్ ద్వారా నిర్ధారించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో 14 రకాల ఖనిజాల ఉనికి కనుగొనబడిందని, వీటిలో లాంథనం, సీరియమ్, ప్రసియోడీమియం వంటి 6 రకాల లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, అలాగే ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి 8 రకాల హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని కనుగొన్నామని, వీటిపై ఇంకా సంపూర్ణ పరిశీలన, విశ్లేషణ, లాభదాయకత శాతాన్ని బట్టి ఉత్పత్తి ప్రక్రియ వంటి అంశాలను ఐఎంఎంటి సంస్థ ద్వారా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఎంటీ డైరెక్టర్ శ్రీ డాక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వ్యర్థాల నుండి క్రిటికల్ మినరల్స్ వెలికితీత, స్వదేశీ సాంకేతిక పద్ధతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. భారతదేశంలో గ్రీన్ టెక్నాలజీ కి అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, క్రిటికల్ మినరల్స్ భద్రత దిశగా ఇది గొప్ప ముందడుగు అన్నారు. ఇది లాభదాయకంగా ఖనిజాల వెలికితీత అవకాశాలకు బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలపై సిఎస్ఐఆర్ – ఐఎంఎంటి చీఫ్ సైంటిస్ట్ మరియు హైడ్రో ఎలక్ట్రో మెటలర్జీ శాఖ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్, సింగరేణి సంస్థ నుండి కార్యక్రమంలో డైరెక్టర్(పి అండ్ పి) కె.వెంకటేశ్వర్లు సంతకాలు చేశారు. ఈడీ ఎస్టీపీపీ చిరంజీవి, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ బి.శ్రీనివాస్, జీఎం చింతల శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, సాంకేతిక నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. రైజింగ్ తెలంగాణ నెంబర్ వన్ 2047 లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని పర్యాటక, ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పర్యటన నేపథ్యంలో మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరుతున్న ఏర్పాట్లను ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్టు తెలిపారు. సీఎం నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకుంటుందన్నజరుపుకుంటుందన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధమైనట్టు తెలిపారు. దాదాపు రూ.500 కోట్లతో ఇక్కడ పలు అభివృద్ధి పనులకు సీఎం శంకు స్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. పోలీస్ స్టాఫ్ క్వార్టర్స్, మహిళల ఆర్థిక ప్రగతి కోసం పెట్రోల్ బంకులు, స్కూల్ బిల్డింగ్స్ లాంటి అభివృద్ధి పనులకు పునాది పడనుందన్నారు. అలాగే మహిళాసంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

**కాంగ్రెస్ శ్రేణులతో మంత్రి సమావేశం...**
తెలంగాణ ప్రజాప్రభుత్వ రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్థానిక ప్రజా సేవాభవన్‌లో ఆయన పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం ఆదిలాబాద్ పర్యటనకు సంబంధించి శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల అభ్యర్థుల గెలుపునకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్, నిర్మల్ అసెంబ్లీ ఇన్‌చార్జీలు శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్, శ్యాం నాయక్, శ్రీహరి రావు, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నాయకులు గోక గణేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గండ్రత్ సుజాత నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బీసీల నాయకత్వంలో
# బహుజనుల రాజ్యాధికారం

**బెల్లంపల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
అణగారిన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం అని మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి నియోజకవర్గం తాండూరు మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి మేడి శివ నామినేషన్ వేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 90 శాతం ఉన్నప్పటికీ, పిరికెడు మంది కూడా లేని అగ్రవర్ణాల పెత్తనానికి, అణిచివేతకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అగ్రవర్ణాల పార్టీలు డబ్బు రాజకీయాలను ప్రేరేపిస్తున్నాయని మండిపడ్డారు. నిజమైన ప్రజా రాజకీయాలను ప్రజలకు అందేవిధంగా ఎవరెంతో వారికంత వాటా అన్ని రంగాల్లో చట్టబద్ధంగా దక్కాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలకు ఊడిగం చేస్తూ, వారికి కొమ్ముకాస్తున్న బహుజనులు మేల్కొని, మన రాజ్యాధికారం సాధించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల ఆగడాలకు చరమగీతం పాడాలని, వారి పార్టీలకు రాజకీయ సమాధులు కట్టేందుకు పునాది వేయాలని, ఈ స్థానిక ఎన్నికల్లో మీ చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. అగ్రవర్ణాల నాయకుల కనుసన్నల్లో పోటీలో ఉండి, మళ్ళీ అగ్రవర్ణాల నాయకులకు ఊడిగం చేసేవారిని ఓడగొట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేసే వారిని గెలిపించాలని తెలిపారు. రానున్నది బీసీ రాజ్యమే అని, బీసీల నాయకత్వంలో రాజ్యాధికారం సాధించేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## వరి కొయ్యలను కాల్చవద్దు

**దహెగాం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
రైతులు పొలాల్లో వరి కొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం దాహెగాం మండలంలోని గిరవెల్లి, కర్జీ గ్రామాల సమీపంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను రైతులకి వివరించారు. రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని తెలిపారు. సాగు విషయంలో సందేహాలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మార్పీఎస్ నేతలు



**కాసిపేట, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నేత కల్వల శరత్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామ పంచాయతీ బీఆర్ఎస్ అభ్యర్థిగా కల్వల శరత్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రామచందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతల భీమయ్య, గ్రామ అధ్యక్షులు వెల్ది శ్రావణ్, వంశీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## చైనా మంజా విక్రయించొద్దు

**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాల్లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో చైనా మాంజా విక్రయిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రజలకు హాని కలిగించే ఏ చర్యలకు ఉపక్రమించిన చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పోలీసులు తెలిపారు.

### గండి రామన్న ఆలయంలో
## దత్త జయంతి వేడుకలు



**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్త మందిరం మందులాపూర్ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలుమంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించి వేడుకల్లో భాగంగా మొదటి రోజు సాయి పారాయణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బురాజ్ ధర్మకర్తలు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నిర్మించే అభివృద్ధి పనులకు ప్రముఖ వ్యాపారవేత్త ముత్యం సంతోష్ గుప్తా చేయూతనందించారు. ఆలయ నిర్మాణానికి 151 సిమెంట్ బస్తాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోటగిరి శ్రీధర్ రాకేష్ తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల నిర్మాణం

**జన్నారం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

మండలంలో స్థానిక ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. జన్నారంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జడ్పి పాఠశాలలో ఎన్నికల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వికలాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులను నిర్మించారు. వీల్ చైర్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని పంచాయతీ ఈవో రాహుల్ తెలిపారు.



# హిల్ట్ పాలసీపై ప్రభుత్వం అబద్ధపు మాటలు

### ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో అధికారులు ఉన్న కాంగ్రెస్ పార్టీ అక్రమ దోపిడీకి హీల్ట్ పాలసీ నిదర్శనమని బిజెఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి మరోసారి ఆరోపించారు. మంగళవారం నిర్మల్లో ఆయన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ పాలసీపై మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించిన అంశాలన్నీ అబద్ధపు మాటలుగా పేర్కొన్నారు. పారిశ్రామికరణ పేరుతో ప్రభుత్వ భూములను ప్రైవేటు వారికి దారా దత్తం చేసిందికి ప్రభుత్వం ఈ పాలసీ రూపొందించినట్టు బిజెపి ఆరోపిస్తుందన్నారు. పరిశ్రమల అభివృద్ధికి తమ పార్టీ వ్యతిరేకం కాదని పరిశ్రమల పేరుతో ప్రజా సంపదను కొల్లగొట్టేందుకు ప్రభుత్వ చేపడుతున్న చర్యలను మాత్రమే వ్యతిరేకిస్తున్నా మన్నారు. 22 మల్టీ జోన్ల పరిధిలోని 92 92 ఎకరాలు ప్రభుత్వ భూమిని తక్కువ ధర కి కార్పొరేట్ పెద్దలకు అప్పగించేందుకు ప్రభుత్వం ఈపాలసీ రూపొందించిందని ఆరోపించారు. ఈ పాలసీ ద్వారా 129 లక్షల కోట్ల అవినీతి అక్రమాలు జరిగే అవకాశం ఉందని దీని పై బిజెపి ఇప్పటికే రాష్ట్ర గవర్నర్కు ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. ఈ పాలసీపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం స్పందించి అనుమానాలను నివృత్తి చేయవలసిన మంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అసబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటి కైనా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు న్యా యం జరిగేలా చూడాలని లేకపోతే బిజెపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు రితేష్ రాథోడ్ పాల్గొన్నారు.

# కోతుల సమస్యను తీర్చే వారికే ఓటు వేస్తాం

### కోతుల నివారణ ఉద్యమకర్త శంకర్

**ఖానాపూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రస్తుతం స్థానిక ఎన్నికల జోరు కొనసాగుతుండగా రాజకీయ పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులను ఓడించాలని, ప్రతి గ్రామంలో కోతుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చిన నాయకుడికి ఓటు వేసి గెలిపించాలని కోతుల నివారణ ఉద్యమకర్త ఆమంద శంకర్ మంగళవారం ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కోతుల సమస్య విపరీతమవుతుందని వాటిని ఏ నాయకుడు, అధికారులు, అరికట్ట లేకపోవడం వల్ల చాలామంది వాటికి భయపడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉండగా ఈ సమస్య తీరుస్తామని ఏ ఒక్క పార్టీ తమ ఎజెండాలో తెలుపకపోవడం దారుణం అన్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామస్తులు ఎక్కడివారక్కడ అభ్యర్థులను నిలదీయాలని



వాటిని నివారిస్తేనే ఓటు వేస్తామని తెలపాలన్నారు. వారు హామీ ఇవ్వకపోతే ఇండిపెండెంట్ అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. దీంతో కోతుల సమస్య తీవ్రతను ప్రభుత్వానికి తెలిసేలా చేయాలని, ప్రభుత్వాలు కూడా అడవిలో విపరీతంగా పండ్ల చెట్లను పెంచి కోతులను అడవికి తరలించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

# నామినేషన్ల కోసం పోటెత్తిన అభ్యర్థులు

### రెండవ విడత నామినేషన్లు ముగిశాయి - బెజ్జూర్ సెంటర్లో బారులు తీరిన ఆశావహులు



**బెజ్జూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం జరుగుతున్న నామినేషన్ల పర్వం రెండవ విడతలో భాగంగా మంగళవారం రాత్రికి ముగిసింది. నామినేషన్ దాఖలు చేయడానికి చివరి రోజు కావడంతో, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రా ల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచే ఆయా సెంటర్లు సందడిగా మారాయి. ఈ సందర్భంగా, బెజ్జూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రం ఆశావహులు క్యూలైన్లో బారులు తీరారు. బెజ్జూర్, పెద్ద సిద్దాపూర్, పాపన్న పేట్, తలయి గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయడానికి ఉత్సాహంగా తరలివచ్చారు. పోటీకి సిద్ధమైన అభ్యర్థులు వారి మద్దతుదారులు కేంద్రం ముందు పెద్ద ఎత్తున గుమి గూడటంతో, అక్కడ ఎన్నికల వాతావరణం కనిపించింది. స్థానిక పాలన పీఠాన్ని అధిరోహించడానికి జరుగుతున్న ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో, చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేయాలనుకున్నవారు క్యూ కట్టారు. నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతా వరణంలో ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. పోలీసు సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, నామినేషన్ సెంటర్ల వద్ద భద్రతను పర్యవేక్షించారు. అభ్యర్థుల వెంట వచ్చిన మద్దతుదారులు ఒకేసారి సెంటర్లో పలికి రాకుండా క్రమశిక్షణతో క్యూలో ఉంచి నామినేషన్లను స్వీకరించారు. చివరి రోజు కావడంతో నామినేషన్ల దాఖలు సమయం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి, అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దీంతో రెండవ విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది.



## మానవత్వం చాటుకున్న యువకుడు

**నార్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

వృద్ధ దంపతుల ఆకలి తీర్చి మానవత్వం చాటుకున్నాడు ఒక యువకుడు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో రాత్రి ఎటూవెళ్లే దారిలేక అవస్థలు పడిన వృద్ధులకు అన్నం పెట్టి.. అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతన్పల్లి కులంగూడా గ్రామానికి చెందిన కొడప రాము అంధుడు. అతడు భార్య లక్ష్మి బాయితో కలిసి మంగళవారం నార్నూర్ మండలానికి వచ్చాడు. అయితే.. మండలంలోనే ఆలస్యం కావడంతో చీకటి పడినా స్వగ్రామానికి వెళ్లలేకపోయారిద్దరూ. అంధుడైన భర్తను తీసుకొని ఆ రాత్రి ఎక్కడికి వెళ్లాలో లక్ష్మికి తోచలేదు. దాంతో.. ప్రధాన రహదారి పక్కన బిక్కుబిక్కుమంటూ చలి తీవ్రతకు వణుకుతూ ఓ మూలాన కూర్చున్నారిద్దరూ. ఈ వృద్ధ దంపతుల అవస్థను గమనించిన ఖాజా మరికొందరితో కలిసి దగ్గరకు వెళ్లాడు. భోజనం కూడా చేయలేదని తెలుసుకున్న వారంతా తమ ఇంటి వద్ద అన్నం, కూరలు వండుకొని తీసుకెళ్లి రాము, లక్ష్మిల ఆకలి తీర్చారు. మానవత్వాన్ని చాటుకొన్న ఖాజా, అక్రమ్, వశీంలను పలువురు అభినందించారు.

## ఆదివాసీ పొరు గర్జన సభ వాయిదా

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో ఈ నెల 9న ఆదివాసీ పోరు గర్జన సభ వాయిదా వేస్తున్నట్లు తుడుం దెబ్బ నాయకులు ప్రకటించారు. సభ అనుమతిని కోరుతూ వారం రోజుల క్రితమే ఎస్పీకి వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ ఎన్నికల కోడ్ దృష్ట్యా సభ వాయిదా వేయమని సంబంధిత అధికారుల కోరిక మేరకు చర్చించి ఆదివాసి పోరు గర్జన భారీ బహిరంగ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ ఎస్పీ నితికా పంత్ కు తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు తీర్మానాన్ని అందజేశారు. త్వరలోనే ఆదివాసి పోరు గర్జన బహిరంగ సభ తేదీని ప్రకటిస్తామని తెలిపారు.





## బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం

**లోకేశ్వరం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కన్యాపూర్ గ్రామానికి చెందిన దూదిగాం సుజాత, గండ్ల తులసవ్వలకు చెందిన ఇళ్లు ఇటీవల ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయాయి. మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. త్వరలోనే రెండు కుటుంబా లకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. తక్షణ సహాయం కింద నిత్యావసర సరకులతో పాటు రూ. 5వేలు నగదుఅందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ సాలయి నరేష్, నాయకులు గన్ను నర్సారెడ్డి, సుదర్శన్రెడ్డి, భోజరాం పటేల్, కొత్తూర్ సాయినాథ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులున్నారు.


## ఎన్నికల సామగ్రి పోలింగ్ బూత్‌లకు తరలింపు



**జన్నారం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలోని 29 గ్రామపంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఎంపీడీవో కార్యాలయ అధికారులు మంగళవారం సిద్ధం చేశారు. వాటిని ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్లకు తరలించి ఎన్నికలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మండల అధికారులు వివరించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**జన్నారం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇంధన్‌పల్లి సెక్షన్ అడవులలో ఉన్న మొర్రిగూడ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను ఇంధన్‌పల్లి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ట్రాక్టర్ మొర్రిగూడ గ్రామానికి చెందిన బాణావత్ శ్రీనివాస్‌దని గుర్తించారు టైగర్ జోన్ అడవులలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని లక్ష్మీనారాయణ హెచ్చరించారు.



# ముగిసిన రెండో విడత నామినేషన్ల ఘట్టం

### నిర్మల్ జిల్లాలో జోరు నామినేషన్లు



**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో రెండో విడత నామినేషన్ల ఘట్టం మంగళవారం ముగిసింది. జిల్లాలోని ఈనెల 14న రెండో విడతగా జరగనున్న సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు చివరి రోజు అయిన మంగళవారం పో టపోటీగా నామినేషన్లను దాఖలు చేశారు. నిర్మల్ సోన్ నిర్మల్ రూలర్ దిల్వార్పూర్ సారంగాపూర్ కుంటాల నర్సాపూర్ తదితర మండలాల్లోని 136 గ్రామ పంచాయతీలకు రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లు ఆధారంగా వివిధ రాజకీయ పార్టీల మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులు పోటీగా నామినేషన్లను సమర్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. నామినేషన్ కేంద్రాల్లో అధికా రులు టోకెన్లు జారీ చేసి నామినేషన్ పత్రాలను రాతి వరకు స్వీకరించే విధంగా చర్యలు తీసుకున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ ఆర్డిఓ రత్నా కళ్యాణి సబ్ కలెక్టర్ సాయి సంకేత్ కుమార్ తదితరులు సందర్శించి అధికారులకు సూచనలు చేశారు.

**ఎన్నికల నియమావళి పాటించాలి....**
నిర్మల్ జిల్లాలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వ



నిబంధనలను ప్రతి ఒక్కరు పాటిస్తూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు సహకరించాలని జిల్లా ప్రత్యేక పరిశీలకులు ఆయేషా ముస్రత్ ఖాన్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని ఆయా నామినేషన్ కేంద్రాలను తనిఖీ నిర్వహించి ఎన్నికల సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

## పనులు చేయకుండానే నిధులు స్వాహా : ఆర్ఎస్పీ



**కౌటాల, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
దరిగాం గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే నిధులు కాజేశారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని దరిగాం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ గ్రామం వందేళ్ల నుంచి ఉన్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదన్నారు. చదువుకున్న అభ్యర్థిని స్థానిక ఎన్నికల్లో గెలిపించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామానికి విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిందని, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కన్నయ్యను గెలిపిస్తే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట నాయకులు సత్యనారాయణ, మిన్హాజ్, మహమూద్, వాసు, బాబర్, రవీందర్, తదితరులున్నారు.

## శాంతిఖని గనిని సందర్శించిన ఏఐటీయూసీ నేతలు



**బెల్లంపల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి శాంతిఖనిలో మంగళవారం ఏఐటీయూసీ నాయకులు గనిలోకి దిగారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్ నాయకత్వంలో లీడర్ల బృందం గని పరిస్థితిని పరిశీలించింది. శాంతి గనిలో గత 25 రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అందుకు గల కారణాలు, మైన్ యొక్క సేఫ్టీ, ప్రొడక్షన్ ఎలా ఉందో తెలుసుకోవడం కోసం నాయకులు గనిలోకి దిగారు. గనిని సందర్శించిన వారిలో శాంతిగని మైన్ ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, కాశీపేట-2 పిట్ సెక్రటరీ శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మంతెన రమేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ పొట్ల రాయలింగు, మైన్స్ కమిటీ సభ్యుడు దాడి రమేష్ ఉన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ముథోల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
భైంసా రూరల్ ఎస్సై శంకర్ మంగళవారం కుంసర గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అధికారుల అనుమతి తప్పనిసరి అని, రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని సూచించారు.





## కన్నెపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి మున్నాబి ఏకగ్రీవం

**బెల్లంపల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో నామినేషన్ చివరి రోజు కన్నెపల్లి మండలంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవం అయ్యారు. ముత్తాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎండి మున్నాభీ అంకూస్ నామినేషన్ వేశారు. ఇతరులు ఎవరు నామినేషన్ వేయలేదు. దీంతో ముత్తాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మున్నాబి అంకూష్ ఏకగ్రీవమయ్యారు.

## సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక

**కాసిపేట, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండలం ధర్మారావుపేట సర్పంచ్, రెండు వార్డుల సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వంత గ్రామంలో ప్రేమ్ సాగర్ రావు వర్గం సర్పంచ్‌గా జుగునాక రాధ మనోజ్, ఇద్దరు వార్డు సభ్యులు పార్వతి పద్మపెద్దిరాజు, ఆజ్మీర శ్రీవల్లిలు ఒకొక్క నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు కృషి చేసిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావుకి అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## ప్రజలకు సమర్థవంతమైన పాలన అందాలి

**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా పరిషత్తుల ద్వారా ఆయా మండలాల్లో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరు వ చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జెడ్పి సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన శంకర్ మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అడిషనల్ కలెక్టర్లు పాయిజాన్ అహ్మద్ కిషోర్ కుమార్‌ను కలిసి పూలబోకి అందించారు. జెడ్పి ఉద్యోగుల్లో పారదర్శక విధులు నిర్వహించి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ నారాయణ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## లోకో రన్నింగ్ ఉద్యోగులు నిరాహార దీక్ష



**బెల్లంపల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏఐఎల్ఆర్ఎస్ ఆధ్వర్యంలో లోకో రన్నింగ్ ఉద్యోగులు మంగళవారం సామూహిక నిరసన దీక్ష చేశారు. రన్నింగ్ సిబ్బంది పని గంటలు తగ్గించాలని, ఇవ్వాలని వారాంతపు విశ్రాంతి ఇవ్వాల ని, బయట స్టేషన్ విశ్రాంతి (8ం2) గంటలు అమలు చేయాలని, హెడ్ క్వార్టర్ విశ్రాంతి (16ం2) గంటలు అమలు చేయాలని డి మాండ్ చేస్తూ ఈ దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండి యా లోకో రన్నింగ్ స్టాప్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ ఎస్ ఏ) బ్రాం చ్ కార్యదర్శి రవీంద్రర్ రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు ఏకే మోరే, నాగేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు ప్రచారం జోలికెళ్లొద్దు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఉపాధిహామీ, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, ఐకేపీ, ఆరోగ్యశ్రీ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, సీఆర్పీలు, రిసోర్సుపర్సన్లు, ప్రభుత్వ శాఖలో ఒప్పంద పద్ధతిన పనిచేసే వారందరికీ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుంది. వీరు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన. వీరు ఓటు హక్కును సాధారణ ఓటరు మాదిరిగా వినియోగించుకోవచ్చు. కానీ సాధారణ ప్రజానీకం మాదిరిగా ఏ పార్టీకి, అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయకూడదు. నచ్చిన వ్యక్తికి ఓటు వేసుకోవచ్చు. కానీ నచ్చిన పార్టీకి, వ్యక్తి వెంట ప్రచారంలో, సభలు, సమావేశాలు, విందులు, వినోదాల్లో పాల్గొంటే వేటు పడుతుంది.

## వివరాలు టీ పోల్ యాప్‌లో నమోదు చేయాలి

**లోకేశ్వరం, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నామినేషన్ల వివరాలను వెను వెంటనే "టి పోల్ యాప్"లో నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకు రాలు అయిషా మస్రత్ ఖానం అన్నారు. మంగళవారం లోకేశ్వరం మండలంలోని హవర్గాలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. రెండవ విడత నామినేషన్లకు చివరి రోజు అయినందున ఇంకా ఎన్ని నామినేషన్లు వచ్చే ఆస్కారం ఉందని అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లను నిర్ణీత సమయం వరకు స్వీకరించాలని, నామినేషన్లు వేసేందుకు వచ్చినవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆమె తోపాటు ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఈవో సాల్మన్ రాజ్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ విజయమే ప్రజాపాలన ప్రభుత్వానికి రెఫరండం



- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి
- సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయమే రెఫరండమని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వ విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకు చేరుకున్న మంత్రికి జిల్లా నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్ లో పర్యటించనున్న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం సభ నిర్వహించే ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు చేరుకున్న మంత్రి అక్కడ సభ జరిగే ఏర్పాట్లను జిల్లా నేతలతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని సీఎం సభ విజయ వంతానికి చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్దుల గెలుపుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్ లో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో సుమారు 500 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు వెల్లడించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విజయం కాంగ్రెస్ పార్టీకి రెఫరెండం అని, ప్రజలు ఎవరి వైపు ఉన్నారో ప్రతిపక్షాలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్, హరీష్ రావు ఆరోపణలకు ఆ ఎన్నికల విజయమే సమాధానం చెప్పిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినప్పటికీ ప్రజలు మాత్రం కాంగ్రెస్ వైపు ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతి పాలైందని ఆరోపించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనంత అప్పు మాజీ సీఎం కేసీఆర్ చేశారని విమర్శించారు. కేసీఆర్ పాలన పుణ్యమా అని నేడు నెలకు కోట్ల రూపాయల వడ్డీని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఎంత అప్పు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లపూల నర్సయ్య, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్, నిర్మల్ అసెంబ్లీ ఇంచార్జీలు కంది శ్రీనివాస రెడ్డి, ఆడె గజేందర్, శ్యాంనాయక్, శ్రీహరి రావు, నాయకులు గంద్రత్ సుజాత, ముడుపు దామోదర్ రెడ్డి, సాజిద్ ఖాన్, గోక గణేష్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మంచికట్ల అశమ్మ, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుభోద్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ సుబోధ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్క రించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలక్ష్మి సతీష్, సత్యం, ప్రియదర్శిని, సూపర్డెంట్లు పాషా, శ్యామ్, హెల్త్ అడ్వైసర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

**ఇంద్రవెల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

గ్రామస్థాయి ఎన్నికలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఏఎస్పి కాజల్ సింగ్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల దృ ష్ట్యా పోలీసుల ఆధ్వర్యములో మండల కేంద్రంతో పా టు ఈశ్వర్ నగర్ ముత్నూర్, ధనురా (బి) తదితర గ్రా మాల్లో మంగళవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పి కాజల్ సింగ్ మాట్లాడుతూ స ర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జ రగకుండా శాంతియుత వాతావరణం లో ఎన్నికలు నిర్వ హించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ప్రలోభాలకు, భయం భ్రాంతులకు గురి చేయకుండా చూడాలన్నారు. ఎలాంటి ప్రలోభలకూ పాల్పడిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుంద ని హెచ్చరించారు. డబ్బులకు ప్రలోభాలు పెట్టడం నేర మని ఎన్నికల నియ మాలను పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, ఎస్సై సాయన్న పోలీస్ సిబ్బంది రాజకీయ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఆ రెండు జీపీలకు ఎన్నికలు లేనట్లే..!

**దండేపల్లి, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ అధికారుల తప్పిదం.. పట్టింపులేని తనంతో ఆ రెండు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోనున్నా యి. గతంలో నెల్కి వెంకటాపూర్‌లోనున్న వందుర్‌గూ డను విడదీసి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసిన విష యం తెలిసిందే. నెల్కి వెంకటాపూర్‌లో అసలు గిరిజ నులు లేకున్నా సర్పంచ్‌తో పాటు ఐదు వార్డు స్థానాలను ఎస్టీలకు రిజర్వ్ చేయగా, ఇక్కడ ఎన్నికలు నిలిచిపోను న్నాయి. ఇక ఇదిలా ఉంటే తాము కలిసే ఉంటామని, తమ గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా ఎన్నికలు వద్దం టూ వందుర్‌గూడ వాసులు తెగేసి చెబుతున్నారు. ఈ విషయమై ఆందోళనలు చేపడుతున్నా స్పందించే వారే కరువయ్యారని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**రెండు జీపీల్లో ఒక్క నామినేషన్ రాలే..**

డిసెంబర్ 11న గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. సర్పంచ్ స్థానాలతో పాటు, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు గురువారం నుంచి నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. నామినేషన్ల చివరి రోజు వరకూ రెండు పంచాయలతీలకు ఒక్క నామినే షన్ కూడా రాలేదు. దీంతో మరోసారి నెల్కివెంకటా పూర్, వందుర్‌గూడ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిలిచిపోనున్నాయి. ఐదేళ్లపాటు పాలకవర్గం లేకుండానే పంచాయతీలు ఉండిపోనున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

**ఏజెన్సీని తొలగించి ఎన్నికలు నిర్వహించాలి...**

నెల్కివెంకటాపూర్ గ్రామంలో గిరిజనులు లేనందున ఏజెన్సీని తొలగించి ఎన్నికలు నిర్వహించాలని గ్రామ స్తులు కోరుతున్నారు. నెల్కివెంకటాపూర్ గ్రామంలో 2,830 జనాభా ఉంది. 1,763 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో వందుర్‌గూడ-నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీ కలిసి ఉండేది. వందుర్‌గూడలో ఉన్న గిరిజనులు సర్పంచ్ అభ్యర్థికి నామినేషన్ వేయడానికి ముందుకు వచ్చేవారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రామం లో ఒక్క గిరిజనుడు కూడా లేడని గిరిజనులు మొత్తం వందుర్‌గూడ పంచాయతీలోనే ఉ న్నారని, తమ గ్రామాన్ని జనరల్‌గా ప్రకటిం చి ఎన్నికలు నిర్వహించాలనేది గ్రామస్తుల వాదన. ఒక్క గిరిజనుడు కూడా లేని గ్రామా న్ని ఎస్టీ రిజర్వ్ ఎలా చేశారని వారు మండిపడుతున్నారు. నెల్కివెంకటాపూర్ జీపీలో మొత్తం 750 మంది ఓటర్లుండగా, సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ మహిళకు కేటాయించారు. 10 వార్డులకుగాను 5 ఎస్టీలు, 5 జనరల్‌కు కేటాయించారు. 5 జనరల్ వార్డులకు కూడా నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో ఐదేళ్లపాటు సర్పంచ్ లేకుండానే ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీ ఉండనున్నది.

**తమను వేరు చేయొద్దు...**

గతంలో తాము నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీలో ఉన్నామని, అధికారులు విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారని తమను విడదీయవద్దని గ్రామస్తులు వాదిస్తున్నారు. అధికారులు తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే పంచాయతీగా విడగొట్టడం సబబు కాదంటున్నారు. కేవలం 198 మంది జనాభా, 163 మంది ఓటర్లున్న గ్రామాన్ని ఎలా విడదీస్తారంటూ వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. వందుర్‌గూడను నెల్కివెంకటాపూర్ పంచాయతీలో కలిపే వరకూ నామినేషన్ వేయమని చెబుతున్నారు. దీంతో ఇక్కడ ఎన్నికలు నిలిచిపోనున్నాయి. ఇక్కడ 100 శాతం గిరిజనులు ఉండడంతో సర్పంచ్ స్థానంతో పాటు 8 వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. పాత పంచాయతీలోనే కొనసాగాలని, ప్రత్యేక పంచాయతీ వద్దని గ్రామస్తులు గతంలో ఆందోళనలు చేశారు. నెల్కివెంకటాపూర్-వందుర్‌గూడ గ్రామాలను ఒకటే జీపీగా గుర్తించే విషయంలో పునఃపరిశీలన చేసి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర న్యాయస్థానం స్థానిక అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసిందని గ్రామ పెద్దలు అంటున్నారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని, ఇప్పుడు మళ్లీ నోటిఫికేషన్ వేసి ఎన్నికలు నిర్వహిస్తే తాము ఒప్పుకోమని వారు అంటున్నారు.




# దేవర 2 నుంచి మరో ట్విస్ట్..!



ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్ లో జనతా గ్యారేజ్ సక్సెస్ అవ్వగా నెక్స్ట్ ఆచార్య తర్వాత ఫ్లాపులో ఉన్న డైరెక్టర్ కి పిలిచి మరీ ఛాన్స్ ఇచ్చాడు తారక్. కొరటాల శివ కూడా పాన్ ఇండియా లెవెల్ లో దేవర అంటూ ఒక మూవీ తీశాడు. దేవర పార్ట్ 1 లాస్ట్ ఇయర్ రిలీజైంది. సినిమాపై ఉన్న అంచనాలను అది రీచ్ కాలేదని చెప్పాలి. ఐతే దేవర 2 విషయంలో కూడా ఆడియన్స్ కి అంత ఆసక్తి లేదు. దేవర 1 లో చాలా ప్రశ్నలు చిక్కుముడులు ఉన్నాయి. వాటన్నిటికీ దేవర 2లోనే ఆన్సర్స్ ఉన్నాయి.ఐతే దేవర 2 దాదాపు ఆగిపోయినట్టే అంటూ గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. అఫీషియల్ గా చెప్పలేదు కానీ దాదాపు అందరు దేవర 2 ఆగిపోయినట్టే అని ఫిక్స్ అయ్యారు. దేవర 2 విషయంలో మేకర్స్ నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. ఇదిలాఉంటే కొరటాల శివ వేరే ప్రాజెక్ట్ కి షిఫ్ట్ అవ్వడం ఈ వార్తలకు మరింత బలాన్ని ఇచ్చాయి. ఐతే లేటెస్ట్ ఇన్ఫర్మేషన్ ప్రకారం దేవర 2 ఆగిపోలేదని చెబుతున్నారు.కొరటాల శివ దేవర 2 కి టైం ఉందని ఈలోగా మరో సినిమా చేసుకుంటే బెటర్ అని ఆలోచించారట. ఎన్టీఆర్ కూడా దానికి ఓకే చెప్పారట. ఐతే కొరటాల శివతో సినిమా చేసే హీరో ఎవరన్నది ఇంకా క్లారిటీ రాలేదు. స్టార్స్ అంతా తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. యంగ్ హీరోతో కొరటాల శివ కలిసి పనిచేయాలి. సో అది ఎప్పుడు కుదురుతుందో చూడాలి. ఐతే కొరటాల శివ దేవర 2 కథ దాదాపు ఫైనల్ చేశారట. తారక్ కూడా దేవర 2 ఎలాగైనా చేయాలనే ఆలోచనలో ఉన్నారట.దేవర 1ని మర్చిపోయేలా దేవర 2 కంప్లీట్ గా కొత్త సెటప్ తో అదిరిపోయే టర్న్, ట్విస్ట్ లతో ప్లాన్ చేస్తున్నాడట కొరటాల శివ. అలా అయితే దేవర 2 కచ్చితంగా మళ్లీ బజ్ క్రియేట్ చేసే ఛాన్స్ ఉంటుంది. దేవర 2 ఉంటుందా లేదా ఈ ప్రశ్న దాదాపు ఆరు నెలల నుంచి చర్చల్లో ఉంది.నిన్న మొన్నటిదాకా దేవర 2 అటకెక్కేసిందన్న వార్తలు రాగా మళ్లీ ఇప్పుడు దేవర 2 కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. మరి ఎన్ టీ ఆర్, కొరటాల శివ దేవర 2 ఏం చేస్తారో తెలియదు కానీ ఫ్యాన్స్ మాత్రం ఈ కన్ ఫ్యూజన్ తో పిచ్చెక్కిపోతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా తర్వాత త్రివిక్రం, నెల్సన్ రెడీగా ఉన్నారు.దేవర 2 చేయాలని అనుకున్నా కచ్చితంగా మరో ఏడాది తర్వాతే అది సెట్స్ మీదకు వెళ్తుంది. ఈలోగా దేవర 1 మీద ఉన్న నెగిటివిటీ పోయి కొత్తగా దేవర 2 ని ప్రమోట్ చేసే ప్లాన్ చేస్తున్నారు. మరి దేవర 2 పై ఈ డిస్కషన్ రోజుకొక ట్విస్ట్ తీసుకుంటుంది.ఐతే సినిమా ఉన్నా లేకపోయినా అఫీషియల్ గా ఒక మాట చెప్పేస్తే బెటర్ అని ఆడియన్స్ భావిస్తున్నారు.

# 30 భాషల్లో తెలుగు సినిమా రిలీజ్



టాలీవుడ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఆయన నటించిన 'మిడిల్ క్లాస్ మెలోడీస్' చిత్రం కోవిడ్ సమయంలో నేరుగా ఓటీటీలో రిలీజ్ అయింది. ఈ సినిమాను వినోద్ అనంతోజు డైరెక్ట్ చేయగా దీనికి ఓటీటీలో సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. ఇక ఇప్పుడు మరోసారి ఈ కాంబోలో ఓ సినిమా రాబోతుంది.వీరిద్దరి కాంబినేషన్‌లో ఈసారి ఓ కల్ట్ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, గతంలో మాదిరే ఈసారి కూడా వీరి కాంబోలో రాబోతున్న చిత్రాన్ని నేరుగా ఓటీటీలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. 'W అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఏకంగా 30 భాషల్లో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను నేరుగా ఓటీటీలో రిలీజ్ చేయడంపై నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ.. 'కొన్ని సినిమాలు థియేటర్లలో రిలీజ్ చేయాలి.. మరికొన్ని సినిమాలు నేరుగా ప్రేక్షకులను అలరించాలి.. అందుకే ఈ సినిమాను నేరుగా ఓటీటీలో రిలీజ్ చేస్తున్నాం..' అంటూ ఆయన కామెంట్ చేశారు.



# త్రివిక్రమ్ వెంకీ కాంబో టైటిల్ ఖరారు..


టాలీవుడ్ హీరో విక్టరీ వెంకటేశ్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో జతకట్టిన సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తోన్న ఈ చిత్రంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా టైటిల్‌పై టాలీవుడ్‌లో చర్చ మొదలైంది. ఈ మూవీలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ విషయాన్ని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు.అయితే మరోవైపు ఈ మూవీ టైటిల్‌పై కూడా టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం సూపర్ హిట్ తర్వాత వస్తోన్న సినిమా కావడంతో ఆడియన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ మూవీ షూటింగ్ ఈ ఏడాది చివర్లో మొదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ టైటిల్‌పై సినీ ప్రియుల్లో చర్చ మొదలైంది.త్రివిక్రమ్ శ్రీనివాస్ వెంకటేశ్ మూవీకి టైటిల్ ఇప్పటికే ఖరారైనట్లు తెలుస్తోంది. 'బంధు మిత్రుల అభినందనలతో' అనే టైటిల్‌ను తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో రిజిస్టర్ చేసినట్లు సమాచారం. కాగా.. ఈ చిత్రం వెంకీ మామ కెరీర్‌లో 77వ సినిమాగా నిలవనుంది. ఈ సినిమా వెంకీతో త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రం కావడం విశేషం. గతంలో నువ్వు నాకు నచ్చావ్, వాసు, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. ఈ మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌లో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.

# ఆరు సినిమాలతో తమన్నా ఫుల్ బిజీ



సినిమాలతో షేకాడిస్తున్న పాల బ్యూటీవిజయ్ వర్మతో బ్రేకప్ తమన్నాను పూర్తిగా మార్చేశాయి. కెరీర్ అండ్ ఫిజికల్లీ కూడా డ్రాస్టింగ్ ఛేంజస్ చూస్తోంది. వెయిట్ లాసైన గ్లామర్ బ్యూటీ కెరీర్‌పై మళ్లీ కాన్సన్ట్రేషన్ చేయడంతో ఆఫర్లు వచ్చి ఒళ్లో వాలిపోతున్నాయి. ఇప్పటి వరకు నయనతార, సంయుక్త మీనన్, వామికా గబ్బీల లైనప్ వేరే లెవల్ అనుకుంటే వాళ్లను మించిపోతోంది మిల్కీ బ్యూటీ. ఓ వైపు ఐటమ్ సాంగ్స్.. మరో వైపు హీరోయిన్‌గా వరుస ఆఫర్లు కొల్లగొడుతోంది. ముఖ్యంగా బాలీవుడ్‌లో క్రేజీ ప్రాజెక్ట్స్‌తో ఫుల్ స్వింగ్‌లో ఉంది.బాలీవుడ్‌లో తమన్నా ఫెయిల్యూర్స్ చూసినా ఆమెకు మంచి ఆఫర్లనే కట్టబెడుతోంది నార్త్ బెల్ట్.. షాహిద్ కపూర్ ఓ రోమియో, అజయ్ దేవగన్, సంజయ్ దత్ రేంజర్, రాగిణి ఎంఎంఎస్3, రోహిత్ శెట్టి అన్ టైటిల్డ్ ఫిల్మ్‌తో పాటు సిద్ధార్థ్ మల్హోత్రా వివాన్ చిత్రాల్లో నటిస్తోంది బ్యూటీ. ఇదే కాకుండా మరో మూవీని లైన్లో పెట్టిందట. లెజెండరీ ఫిల్మ్ మేకర్ వి శాంతారాం బయోపిక్ ఆధారంగా హిందీలో ఓ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో టైటిల్ రోల్ పోషిస్తున్నాడు సిద్ధాంత్ చతుర్వేది. రీసెంట్లీ అతడి ఫస్ట్ లుక్ రివీల్ చేసింది టీం. ఈ ప్రాజెక్టుకు రీసెంట్లీ సైన్ చేసిందట తమన్నా. ఇక ఈ ఏడాది తెలుగు, హిందీలో చేసిన సినిమాలు వెబ్ సిరీస్ కూడా పెద్దగా ఎంటర్టైన్ చేయనప్పటికీ ఐటమ్ సాంగ్స్‌తో కవర్ చేసేసింది తమన్నా. రైడ్2, బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌లో స్పెషల్ సాంగ్స్‌తో రచ్చ లేపింది తమ్ము. హీరోయిన్‌గా ఆమెకు ఛాన్సులు తెచ్చిపెట్టడం, ఐటమ్ నంబర్ ఆయుధంగా మారడంతో వాటిని వదల్లేకపోతోంది. ఎక్కడ ఛాన్స్ వచ్చినా నో చెప్పడం లేదు. అందుకే మన శంకర్ వర ప్రసాద్ గారులోనూ చిరుతో స్టెప్పులేసిందట. అలాగే రాజాసాబ్‌లో కూడా డార్లింగ్‌తో స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడిందన్న టాక్ నడుస్తోంది. ఇక తమిళంలోనూ విశాల్-సుందర్‌తో మరోసారి కొలబరేట్ అవుతోంది మిల్కీ బ్యూటీ. ఈ లైనప్ చూస్తుంటే.. నెక్స్ట్ ఇయర్ తమన్నా.. మిగిలిన భామలకు కాంపిటీషన్ అయ్యేట్లుగానే కనిపిస్తోంది.

# రవితేజపై వాంటెడ్ నెగిటివిటీ



తనదైన సినిమాలతో తెలుగు ఆడియెన్స్ కి ఎంతో ఎంటర్టైన్మెంట్ ని ఇచ్చి తన స్వశక్తితో ఎదిగిన అతి కొద్ది మంది హీరోస్ లో మాస్ మహారాజ రవితేజ కూడా ఒకరు. కొన్నాళ్ల కితం వరకు తన విజయాన్నే తమ విజయంగా భావించే ఫాలోవర్స్ ఉన్నారు. కానీ ఇప్పుడు ఊహించని విధంగా తనపై పాజిటివ్ కంటే నెగిటివ్ స్ప్రెడ్ అవుతుంది. అయితే ఈ టాక్సిక్ సోషల్ మీడియా యుగంలో చేతిలో మొబైల్ ఉంటే చాలు కనీసం ఆలోచన లేకుండా ఇష్టమొచ్చినట్టు రాసుకుంటున్నారు ఓ సెక్షన్ ఆఫ్ ఆడియెన్స్.సినిమా చూడకుండానే బాలేదు అంటారు రిలీజ్ రోజే డిజాస్టర్ అంటూ నెగిటివ్ ట్రెండ్ లు చేస్తారు. ఇంకా చాలా తతంగమే సోషల్ మీడియాలో వెగటు పెట్టించే రేంజ్ లో తీసుకెళ్తున్నారు. ఇదే ఇప్పుడు రవితేజ విషయంలో కూడా జరుగుతుంది అని చెప్పాలి. తాజాగా రవితేజ నెక్స్ట్ చేయబోయే సినిమాలో ఏకంగా ఆరుగురు హీరోయిన్స్ అంటూ పుట్టించిన పుకారు యిట్టే వైరల్ అయ్యింది.అది ఎంతవరకు నిజం, అబద్దం అని ఆరా తీసింది లేదు కానీ ఇవన్నీ చేస్తే వారికేం వస్తుందో అలా చేస్తున్నవారికే తెలియాలి. ఓ రకంగా చూస్తే ఇదంతా నిష్కారణంగానే జరుగుతున్న క్యాంపైన్ గా కూడా న్యూట్రల్ ఆడియెన్స్ కి అనిపిస్తుంది. ఎక్కడి వరకు ఎందుకు మొన్ననే వచ్చిన మాస్ జాతర థియేటర్స్ లో ఉన్నపుడు టాక్ ఒకలా వచ్చింది. ఓటీటీలోకి వచ్చాక ఒకలా వచ్చింది. సో ఈ డ్యామేజ్ అంతా ఎప్పటికి ఆగుతుందో చూడాలి.




■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ రెబెల్స్‌తో పాటు స్వతంత్రులు విత్ డ్రా చేసుకునే విధంగా ప్రయత్నాలు ■ భారీ ఖర్చుకు సైతం మొగ్గు చూపుతున్న అభ్యర్థులు

■ మొదటి విడత పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికారులు ■ చివరి రోజు జోరు తగ్గని నామినేషన్లు

■ అర్ధరాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ ■ ముగిసిన రెండో విడత ■ నేడు మూడవ విడతకు నోటిఫికేషన్

■ నేడు మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ■ పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఓవైపు రెండోవ విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా, మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థులకు బుజ్జగింపుల పర్వం మొదలైంది. ప్రధాన పార్టీల మద్దతుతో వేసిన వారే కాకుండా రెబల్స్, స్వతంత్రుల పైన దృష్టి పెట్టి విత్‌డ్రా చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. మొదటి విడత పోటీలో ఉన్న అభ్యర్థుల విత్ డ్రాకు ప్రధాన పార్టీల నేతలు వారితో మాట్లాడుతున్నారు. పోటీ నుంచి వైదొలుగితే తగిన అవకాశాలు కల్పిస్తామని భవిష్యత్తుల్లో కీలక పదవుల ను ఇస్తామని హామీలు ఇస్తున్నారు. కొన్ని చోట్ల గుడ్ విల్ కింద కొంత అమౌంట్ ఇచ్చి సెటిల్ చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ ఎన్నికల రెండోవిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రెండో విడతలోనూ చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. రెండో రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు రాగా, మంగళవారం తక్కువగానే ఉంటాయని భావించారు. కానీ రెండో రోజుకన్నా చివరి రోజే ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి క్యూలో ఉన్న వాళ్ళకు టోకెన్లు ఇచ్చి, బయటకు పంపించారు. టోకెన్ల ప్రకారం పది మంది చొప్పున లోపలికి అనుమతించారు.

# బుజ్జగింపులు..షురూ..!

## గ్రామాల్లో అభ్యర్థుల విత్‌డ్రా కోసం కొనసాగుతున్న సంప్రదింపులు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామ పంచాయతీల్లో ఓవైపు రెండోవ విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థులకు బుజ్జగింపుల పర్వం మొదలైంది. మొదటి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి కావడంతో గ్రామాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో సంప్రదింపులను మొదలు పెట్టారు. ప్రధాన పార్టీల మద్దతుతో వేసిన వారే కాకుండా రెబల్స్, స్వతంత్రుల పైనదృష్టి పెట్టి విత్‌డ్రా చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. మొదటి విడత పోటీలో ఉన్న అభ్యర్థుల విత్ డ్రాకు ఒక్కరోజే అవకాశం ఉండటం ప్రధాన పార్టీల నేతలు వారితో మాట్లాడుతున్నారు. పోటీ నుంచి వైదొలుగుతే తగిన అవకాశాలు కల్పిస్తామని భవిష్యత్తుల్లో కీలక పదవులను ఇస్తామని హామీలు ఇస్తున్నారు. కొన్ని చోట్ల గుడ్ విల్ కింద కొంత అమౌంట్ ఇచ్చి సెటిల్ చేసుకుంటున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు విననిచోట పార్టీ సీనియర్లు పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. విత్‌డ్రాకు ఇక ఒక్కరోజే మొదటి విడతకు ఒక్క రోజే సమయం ఉండటంతో పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి చర్చలు జరుపుతున్నారు. రెండో విడత గ్రామాల్లో నామినేషన్ల జోరు పూర్తి కాగా ఆ గ్రామాల్లోనూ ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో చర్చలు జరిపేందుకు సిద్ధం అవుతున్నారు.

**నేడు మూడవ విడతకు నోటిఫికేషన్..**

గ్రామ పంచాయతీలో సర్పంచ్ కీలక పదవి కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నేతలు దృష్టి పెట్టారు. పార్టీ తరపున మద్దతు ఇచ్చిన వారు కాకుండా రెబల్స్ నామినేషన్లు దాఖలు చేయడంతో వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. వారితో చర్చిస్తూ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. పార్టీ పరంగా రాబోయే రోజుల్లో తగిన అవకాశాలు కల్పిస్తామని బుజ్జగిస్తున్నారు. కొన్ని చోట్ల ఖర్చుల పేరుమీద పోటీలో ఉన్న అభ్యర్థితో కొంత మొత్తంలో ఇప్పించి పోటీ నుంచి తప్పించే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. విత్ డ్రాకు ఒక్కరోజే సమయం ఉండటంతో పూర్తిస్థాయిలో ఇంచార్జిలను అప్పచెప్పి సంప్రదింపులు జరుపుతున్నారు. మొదటి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి కావడంతో పోటీలో ఉన్న వారు ప్రచారంపై దృష్టిపెట్టారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో సర్పంచ్ అభ్యర్థుల ఖర్చు కూడా భారీగా పెరిగింది. ప్రతి రోజు గ్రామంలో ప్రచారం కోసం వేలాది రూపాయలను వెచ్చిస్తున్నారు. తమతో తిరిగే వారితో పాటు ఇతరులకు ఖర్చు భారీగా పెడుతున్నారు. మొదటి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి అయి విత్‌డ్రాకు ఒక్కరోజే సమయం ఉండగా రెండో విడత గ్రామ పంచాయతీల్లో నామినేషన్లు ఘట్టం పూర్తి అయ్యింది. ముందే నిర్ణయించుకున్న అభ్యర్థులు పోటీ పడి వార్డులకు, సర్పంచ్ పదవుల కోసం దాఖలు చేశారు. మొదటి విడత కంటే ఎక్కువగా ఈ గ్రామాల్లో నామినేషన్లు దాఖలు అయ్యాయి. నేడు మూడవ విడతకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మూడవ విడత గ్రామాల్లో సర్పంచ్, వార్డుల కులం అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. చివరి విడత కావడంతో అధికారులు కూడా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడత పోలింగ్ కోసం అధికారులు దృష్టిపెట్టారు. గ్రామ పంచాయతీల్లో నేడు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. వారికి గుర్తులను కేటాయిస్తారు. మొదటి విడత గ్రామాల్లో ఈనెల 11న జరిగే పోలింగ్ కోసం ఏర్పాట్లను చేస్తున్నారు. కావాల్సిన బ్యాలెట్ బాక్సులను, ఎన్ని కల సామగ్రిని ముందే సమకూర్చుకున్న యం త్రాంగం మరోసారి అవసరమైన శిక్షణను పోలింగ్ సిబ్బందికి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల రెండోవిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది. రెండో విడతలోనూ చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. రెండో రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు రాగా, మంగళవారం తక్కువగానే ఉంటాయని భావించారు. కానీ రెండో రోజుకన్నా చివరి రోజే ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. రాత్రి క్యూలో ఉన్న వాళ్ళకు టోకెన్లు ఇచ్చి, బయటకు పంపించారు. టోకెన్ల ప్రకారం పది మంది చొప్పున లోపలికి అనుమతించారు. కొందరు బయటకు వచ్చి టీ, స్నాక్స్ తిని మళ్లీ నామినేషన్ వేసేందుకు వెళ్లారు. నేడు నామినేషన్లను పరిశీలించనున్నారు.

**నేటి నుంచి మూడో విడత...**

ఎన్నికల రెండు విడుతల నామినేషన్ల స్వీకరణ ముగిసింది. బుధవారం నుంచి ఈ నెల 5 వరకు మూడో విడత మండలాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

**నేడు ఉపసంహరణ...**

మొదటి విడత ఎన్నికల నామినేషన్ల నేడు ఉపసంహరణ జరుగనుంది. 5 గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థులకు అక్షరమాల ప్రకారం బ్యాలెట్‌లో గుర్తులను కేటాయిస్తారు. ఈనెల 11న మొదటి విడత గ్రామాలలో ఓటింగ్ జరుగనుంది. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులను తప్పించేందుకు నాయకులు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టారు. బుజ్జగింపులు, బేరసారాలు, బెదిరింపులు కొనసాగుతున్నాయి. కొందరు అభ్యర్థులు మాత్రం ఉపసంహరణ చేయిస్తారన్న భయంతో ఇప్పటికే తమ ఫోన్‌లు స్విచ్‌ఆఫ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

### జిల్లా ఇంచార్జీ మంత్రి

## జూపల్లికి తేనీటి విందు

**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో బుధవారం పర్యటించనున్న నేప థ్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు నివాసంలో తేనేటి విందుకు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలపై శ్రీహరిరావుతో మంత్రి చర్చించారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.



## రూ.98 వేల నగదు పట్టివేత

**సారంగాపూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

సిర్పెల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.98వేల నగదు పట్టుకు న్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఖాసీఫ్ అనే వ్యక్తి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో రూ.98వేల నగదు తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఆధారాలు చూపకపో వడంతో సీజ్ చేసి సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.


## హార్వెస్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

హార్వెస్టర్‌ను వెనుకనుంచి ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బలరావుపేటకు చెందిన దుర్గం మల్లేశ్ (48) మంగళవారం మధుకర్ అనే వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై దండేపల్లి మండలంలోని కొర్విచెల్మకు వెళ్లి వస్తుండగా పాత వెంకట్రావుపేట, కొమ్ముగూడెం గ్రామాల మధ్య హార్వెస్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టారు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మధుకర్‌కు గాయాలు కావడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఆ గ్రామానికి సర్పంచ్ ఎన్నికలు లేనట్టే

## పెర్కపల్లిలో ఎస్సీలే లేరు.. కానీ ఎస్సీ రిజర్వేషన్




**ఖానాపూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఆ ఊరిలో ఎస్సీలు లేరు, అందరు బీసీలు కానీ ఆ ఊరు సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ వచ్చింది. ఎస్సీ కులస్తులు లేరు రిజర్వేషన్ మార్పులు చేయాలని ఆ గ్రామస్తులు సెప్టెంబర్ నెలలో ధర్నాలు, రాస్తారోకో లు చేశారు. జిల్లా కలెక్టర్ కు కూడ వినతిపత్రాలు అందచేశారు కాని ఫలితం లేకుండా పోయింది. ఆ ఊరు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లోని దస్తురాబాద్ మండలంలో గల పెర్కపల్లి గ్రామం. ఆ గ్రామానికి మొదటిసారి జనరల్ వచ్చింది, ఈ సారి సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ రావడంతో ఆ ఊరు సర్పంచ్ ఎన్నికకు దూరం అయింది. బీసీ 99.9 శాతం ఉన్న గ్రామానికి అధికారులు ఎస్సీ సర్పంచ్ రిజర్వేషన్ కేటాయించారు. అలాగే రెండు వార్డులు కూడా ఎస్సీకి రావడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెరికపల్లె గ్రామంలో మొత్తం 554 మంది ఓటర్లు ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో కొత్తగా గ్రామపంచాయతీని ఏర్పాటు చేసింది. అప్పటి ఎన్నికల్లో సర్పంచ్ గా జనరల్ కు రిజర్వేషన్ ఇవ్వగా, బీసీ అభ్యర్థి సర్పంచ్‌గా గెలిచారు. గ్రామంలో 8 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం సర్పంచ్ అలాగే 2 వార్డు లను ఎస్సీ లకు అధికారులు కేటాయించారు.

**కలెక్టరు వినతిపత్రం ఇచ్చినా...**
రాష్ట్రంలో జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల రిజర్వేషన్లతో పాటు సర్పంచుల రిజర్వేషన్లు సెప్టెంబర్ నెలలో ఖరారు చేయగా ఖానాపూర్ నియోజకవర్గంలోని దస్తురాబాద్ మండలంలో ని గ్రామపంచాయతీ సర్పంచ్, రెండు వార్డు కు ఎస్సీ రిజ ర్వేషన్ కావడంతో ఆ గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్సీ కులస్తులు లేరని, ఆ వర్గానికి సర్పంచ్ రెండు వార్డ్‌లకు సామా జిక వర్గీయులకు రిజర్వేషన్ చేయడముతో ఆ గ్రామస్తులు నిరసిస్తూ మండల కేంద్రంలోనూ, జిల్లా కేంద్రంలోనూ నిరసనలు తెలిపారు. ఆ గ్రామంలో మొత్తం 554 మంది ఓటర్లు ఉండగా అందులో నలుగురు ఎస్టీలు ఉండగా మిగతా బీసీ కులానికి చెందినవారు వున్నారు అని ఎస్సీ రిజర్వేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు ముక్కు ముడిగా సెప్టెంబర్ 29న నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందచేశారు. కాని సర్పంచ్, వార్డ్‌ల రిజర్వేషన్ మారకపోవడ ఆ ఊరు ప్రజలకు నిరాశ మిగిలింది. ఆ గ్రామపంచాయతీ లో ఎస్సీ కులస్తులు లేరు కాని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ రావడంతో అక్కడ సర్పంచ్ ఎన్నిక జరగపోవడంతో ఆ గ్రామపంచాయతీకి ఉపసర్పంచ్ సర్పంచ్ గా కొనసాగే అవకాశాలు ఉండడంతో ఆ ఊరిలో ఉప సర్పంచ్ పదవికి తీవ్ర పోటీ వున్నట్లు గ్రామస్తులు అంటున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ








**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అన్నను దారుణంగా
# చంపిన తమ్ముడి అరెస్టు

**రాకృష్ణాపూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సండ్రోన్‌పల్లిలో అన్నను కొట్టిచంపిన ఘటనలో నిందితుడు మెండ్రపు కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సండ్రోన్‌పల్లికి చెందిన మెండ్రపు కుమార్ అతని అన్న మెండ్రపు గోపాల్ ఇద్దరు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. గోపాల్ తరుచూ మద్యం సేవించి గొడవకు దిగేవాడు. గోపాల్, అతని భార్య గంగా వేధింపుల కారణంగా కుమార్ భార్య చంద్ర కళ కూతురుతో సహా ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీనికి తోడు రోజువారీ గొడవలు మరింత పెరిగాయి. ఈ నెల1న రాత్రి గోపాల్ మళ్లీ గొడవకు దిగడంతో కోపోద్రిక్తుడైన కుమార్ రోకలిబండతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమావేశంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణంలోని పలురూట్లలో ఆంక్షలు





**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
ఈనెల 4న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ డైవర్షన్ చేపడుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అంకోలి, తంతోలి గ్రామాల ప్రజలు కేఆర్‌కే మీదుగా పిట్టల్‌వాడ నుంచి పట్టణానికి చేరుకోవాలని పేర్కొన్నారు. ఏరోడ్రమ్ నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డుపై పూర్తిగా ఆంక్షలు ఉంటాయన్నారు. నిర్మల్, మావల మీదుగా సభకు వచ్చే బస్సులు పిట్టల్‌వాడ, మావల పోలీస్ స్టేషన్ మీదుగా తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

### పలు చోట్ల రేపు ట్రాఫిక్ మళ్లింపు

ఉదయం నుంచి ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, కేఆర్ కే కాలనీ, హ్యాండిక్యాప్ కాలనీకి ఆంక్షలు వర్తిస్తాయన్నారు. అత్యవసర పనుల కోసం ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలన్నారు. వీఐపీ వాహనాలు తెలంగాణ చౌక్ మీదుగా కాన్వెంట్ స్కూల్, సరస్వతి శిశు మందిర్ నుంచి టీటీడీ కల్యాణ మండపానికి చేరుకోవాలన్నారు. సభకు వచ్చే ప్రజలు ద్విచక్ర వాహనాలను రాంలీలా మైదానం, సైన్స్ డిగ్రీ కళాశాలలో పార్కింగ్ చేయాలన్నారు. టూవీలర్లు, కార్లు, ఆటోలను కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసి నడక మార్గంలో సభాస్థలానికి చేరుకోవాలని సూచించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

## బైక్‌తో ఢీకొట్టి..
# ప్రశ్నిస్తే తీవ్రంగా గాయపరిచి

**బోథ్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**
బైక్‌పై అతివేగంగా వచ్చి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టగా ప్రశ్నించినందుకు అతనిపై దాడికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీసాయి తెలిపిన వివరాల మేరకు కోఠకె గ్రామానికి చెందిన వినోద్ తన ఆటోను సొనాల మండల కేంద్రంలో ఆటోస్టాండ్ వద్ద ఉంచి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో ఘన్పూర్ నుంచి పల్సర్ బైక్పై అతివేగంగా వచ్చిన జాదవ్ సాయికిరణ్, కిషన్ మహరాజ్ వినోద్‌ను ఢీకొట్టారు. వినోద్ వారిని మందలించడంతో అతనిపై దాడి చేశారు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి బర్గి నాగోరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# సైబర్ నేరగాళ్లను దూరం పెట్టండి

- 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' కార్యక్రమం విజయవంతం చేయాలి
- సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలి
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ



**మంచిర్యాల, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

సైబర్ నేరగాళ్లను దూరం పెట్టాలని, సైబర్ మోసాలకు చెక్ పెట్టే దిశగా తెలంగాణ పోలీసులు నూతన ఆవిష్కరణ చేస్తుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. 'మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది. ఆలోచించండి, చెక్ చేసుకోండి'.. సు రక్షితంగా ఉండాలని ఆయన అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తత కోసం ప్ర త్యేక కార్యాచరణలో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఆయన మాట్లాడు తూ సైబర్ నేరగాళ్లను దూరం పెట్టండి, ఫ్రాడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టండి అంటూ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్ర జలలో అవగాహన పెంపుదల లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో ఆరు వారాలు రాష్ట్ర వ్యాప్త సైబర్ భద్రత ప్రచార కార్యక్రమంలో భాగంగా డీజీపీ, టీజీసీఎస్‌డీ చికాగోయల్, సీనియర్ అధికారులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు ప్రారం భించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో జూమ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పాల్గొన్నామన్నారు. ప్రతి పౌరుడు జాగ్ర త్తగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్‌లో తెలంగాణలో సైబర్ భద్రతను బలో పేతం చేసే ముఖ్య కార్యక్రమమని సీపీ తెలి పారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోస్ట ర్లు, ఆడియో క్లిప్‌లు ముఖ్య కూడళ్లలో ప్రచా రం చేస్తామన్నారు. సోషల్ మీడియా, ఎన్ఎస్ఎస్ కెడెట్లు సైబర్ క్లబ్స్ ద్వారా ప్రతి కాలేజీ నుంచి ఇద్దరు వలంటీర్లను ఎంపిక చేసి ప్రతి కాలేజీ నుంచి ఐదుగురు విద్యార్థులు, ఒక టీచర్‌ను భాగస్వామ్యం చేస్తామన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అ వగాహన కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించామన్నారు. ఆన్ లైన్ ప్రతిజ్ఞ తీసుకోవడం, సంబంధిత కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ చేశామన్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితమి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, సీసీఎస్ ఏసీపీ రంగారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఉన్నారు.



## జాతీయ స్థాయిలో
# మరోసారి మెరిసిన నార్నూర్

**త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో నార్నూర్‌కు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు**

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నీతి ఆయోగ్ విడుదల చేసిన 2025 సెప్టెంబర్ త్రైమాసిక డెల్టా ర్యాంకింగ్స్‌లో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం దేశవ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం, అలాగే దక్షిణ భారతంలోని జోన్-3లో 1వ ర్యాంక్ సాధించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా నార్నూర్ మండలానికి రూ.1.5 కోట్లు పురస్కారం లభించిందని తెలిపారు. ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు మరోసారి రావడం నార్నూర్ మండలాన్ని దేశంలోని అత్యుత్తమ ప్రదర్శన చేసే మండలాల్లో ఒకటిగా నిలబెట్టడమే కాక, ఇది మొత్తం జిల్లా ప్రజలకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన డెల్టా ర్యాంకింగ్స్‌తో పాటు, నార్నూర్ ఇప్పటి వరకు వివిధ పురస్కారాలు, ప్రోత్సాహకాలను కలిపి మొత్తం రూ.2.78 కోట్లు పొందిందని తెలిపారు. వీటిలో ప్రధానమంత్రి అవార్డు, దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు, స్టేట్స్ యూజ్-కేస్ చాలెంజ్‌లో 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, అదేవిధంగా నీతి ఆయోగ్ నుండి 7 ప్రశంసా పురస్కారాలు ఉన్నాయన్నారు. ఈ విజయాలు నార్నూర్ మండలంలోని నిరంతర అభివృద్ధి, శ్రేష్ఠ పాలనతో పాటు ప్రజాకేంద్రీకృత కార్యక్రమాలను ప్రతిబింబంగా నిలుస్తున్నాయనీ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


## చింతలమానేపల్లి పోలీస్
# స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

**చింతలమానేపల్లి,డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ ను ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సంస్థాగతంగా పార్టీని బలోపితం చేస్తా

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**నిర్మల్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థగా బలో పితం చేసినందుకు సమష్టి కృషితో కష్టపడి పని చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు వేడుమ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా జిల్లా డిసిసి అధ్యక్ష నియామక పత్రాన్ని అందుకొని ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయ చైతన్యమున నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెల్లి పార్టీ నాయకులు కార్యకర్తల సమిష్టి కృషితో సమన్వయం చేసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలిపించుకునేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు జిల్లా బాధితులను అప్పగించిన పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సర్పంచ్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలి



**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**చెన్నూర్, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

రాబోయే సర్పంచు ఎన్నికల్లో చెన్నూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలని, ఇందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కొమ్మెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచు సత్యనంద్‌గౌడ్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరగా మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నా రన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్కెపల్లి షెడ్యూల్ ఏరియాపై
# హై కోర్టులో వాదనలు

**కాసిపేట, డిసెంబర్ 2 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని మల్కెపల్లి గ్రామ పంచాయతీ షెడ్యూల్ ఏరియాపై పలువురు గ్రామస్తులు హై కోర్టును ఆశ్రయించగా మంగళవారం వాదనలు కొనసాగాయి. వచ్చే వారంలో తీర్పు విలువడే అవకాశం ఉందని ఈ కేసును వాదిస్తున్న హై కోర్టు న్యాయవాది వెంటేశ్వర్లు తెలిపారు. రెవెన్యూ రికార్డులకు విరుద్ధంగా నాన్ షెడ్యూల్ ఏరియాగా ఉన్న మల్కెపల్లి గ్రామాన్ని అధికారులు షెడ్యూల్ ఏరియాగా కొనసాగిండం అన్యాయమని, దీనిపై చర్యలు తీసుకొని మల్కెపల్లి గ్రామ పంచాయతీని నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలని కోరుతూ గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు హై కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నాన్ షెడ్యూల్ ఏరియా ఉన్నటువంటి అన్ని ఆధారాలు సమర్పించినట్లు తెలిపారు. అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో వచ్చేవారం తుది తీర్పు వచ్చే అవకాశం ఉందని, నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించే విధంగా అనుకూలంగా వచ్చే అవకాశం ఉందని న్యాయవాది తెలిపారు.

